ఆశయంతో వస్తున్నా..
ఆశీర్వదించండి

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



మేడ్చల్ జోన్‌బృందం: పదవిపై ఆశతో కాకుండా ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో వస్తున్నానని, ప్రజలంతా తమ ఓట్లతో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కీసర మండలంలోని కీసరగుట్ట, అంకిరెడ్డిపల్లి, కీసరచౌరస్తా, భోగారం, కీసరదాయర, కరీంగూడ, రాంపల్లిదాయర, గోధుమకుంట, చీర్యాల, తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, యాద్గార్‌పల్లి, కీసరదాయర గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించలేని మంత్రి మల్లారెడ్డి మనకు అవసరమా..? అని ప్రజలు ఆలోచించాలన్నారు.

- పేద ప్రజలకు వసతులు కల్పించలేని మల్లారెడ్డికి ఈసారి ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని ప్రజలను కోరారు. నగరంలోని బోయిన్‌పల్లికి చెందిన మంత్రి మల్లారెడ్డిని ఈసారి బోయినపల్లిలోని ఇంటికే పరిమితం చేస్తామని అన్నారు.
- స్థానికుడైన తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇక్కడి ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఏళ్ల నుంచి పదవులు ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ ప్రజలకు సేవ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు.
- 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి బీఆర్‌ఎస్ అరాచక పాలనకు చమరగీతం పాడాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలను అమలుచేస్తామని, మహిళలకు ప్రతినెలా రూ.2,500 నగదు, రూ.500లకే గ్యాస్, ఇలాంటి పథకాలను అమలు చేస్తామన్నారు.
- మంత్రి తమ కళాశాలలకు చెందిన ఉద్యోగులను ఇంటింటికీ పంపి ఎన్నికల్లో గెలుపొందేందుకు ఓటర్లకు డబ్బులు ఆశ చూపిస్తున్నాడని వారిని అడ్డుకుంటున్న స్థానిక కాంగ్రెస్ నాయకులపై పోలీసులతో అక్రమ కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ నేతలపై పెట్టిన కేసులను ఎత్తివేయిస్తామన్నారు.



కీసర, భోగారం ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్

బీఆర్‌ఎస్‌కు కార్మిక విభాగం నాయకుడి రాజీనామా



ఘట్‌కేసర్: కార్మిక విభాగం ఉమ్మడి ఘట్‌కేసర్ మండల మాజీ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ ఆ పార్టీకి బుధవారం రాజీనామా చేశాడు. అనంతరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యమాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన సాగుతోందని, మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను అప్పుల తెలంగాణ, తాగుబోతుల తెలంగాణగా మార్చారన్నారు. ఉద్యమకారులను కాదని ఉద్యమ ద్రోహులను అందలమెక్కించడం, విచ్చలవిడిగా దోపిడీ, పార్టీ విధివిధానాలు నచ్చక రాజీనామా చేశానన్నారు.

అందరి చూపు.. హస్తం వైపే..

మేడిపల్లి: మేడ్చల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరడం ఖాయమని పీర్జాదిగూడ 1వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మహ్మద్ మజార్ అన్నారు. కాంగ్రెస్ మేడ్చల్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు మద్దతుగా బుధవారం 1వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. మేడ్చల్‌లో తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు ప్రజలు అభిమానంతో ఓటు వేస్తారన్నారు. నాయకులు బర్ల నాగరాజు, మొగులయ్య, దినేష్, సీపీఐ నాయకులు రచ్చ కిషన్, లక్ష్మి, ప్రమీళ, జ్యోతి, రమేష్, మాధవి, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పుట్ట లక్ష్మణ్ పాల్గొన్నారు.



మల్లారెడ్డికి స్వాగతం పలుకుతున్న జనం

గులాబీ జెండా..
పేదలకు అండ

మేడ్చల్: తెలంగాణలో గులాబీ జెండా పేదలకు అండగా ఉందని బీఆర్‌ఎస్ మేడ్చల్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని శామీర్‌పేట్ మండలం అలియాబాద్, లాల్‌గడీ మలక్‌పేట్, మజీద్‌పూర్, యాడారం తదితర గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ ప్రాణాలను ఫణంగా పెట్టి కొట్లాడి సాధించి సంక్షేమం, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారని అన్నారు. అలాంటి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ ఆగం అవడం ఖాయం అన్నారు. నిత్యం స్కాంలు, అవినీతి, అబద్ధాలతో గడిపే కాంగ్రెస్‌కు పట్టం కడితే రాష్ట్రం పూర్తిగా నాశనం అవుతుందని అన్నారు. తమ ప్రభుత్వ హయంలో బీసీ బంధు, దళిత బంధు, రైతు బంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్టు వంటి పథకాలతో అన్ని రంగాల ప్రజలను ఆదుకున్నామని, మరోసారి అధికారంలోకి రాగనే రూ.400 వంట గ్యాస్ సిలిండర్, పింఛన్ రూ.5వేలు, రైతుబంధు రూ.16 వేలకు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.15 లక్షలకు పెంచుతామని అన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఇంటికీ సన్నబియ్యం అందజేస్తామని, రూ.5 లక్షల ఆరోగ్య బీమా చేస్తామని హామీ ఇచ్చారు.



శామీర్‌పేట్ మండల ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి



జోరుగా ప్రచారం..

మేడ్చల్ నియోజకవర్గంలో జోరుగా ప్రచారం సాగుతోంది. అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు, మండలాలు, గ్రామాల్లో నాయకులు ప్రచారాన్ని సాగిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులను మరోసారి అధికారంలోకి వస్తే చేసే పనులను కరపత్రాలలో ముద్రించి ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు వెళ్లి ప్రచారాలను హోరెత్తిస్తున్నారు.

మేడ్చల్‌లో..

మండలంలోని వివిధ గ్రామాలు, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలలో చైర్ పర్సన్లు లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, దీపికనర్సింహారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానందరెడ్డి, పార్టీ అధ్యక్షుడు దయానంద్ నేతృత్వంలో ఇంటింటి ప్రచారం జోరుగా సాగిస్తున్నారు.





ఘట్‌కేసర్‌లో మంత్రి తనయుడు డాక్టర్ భద్రారెడ్డి

ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు



బోడుప్పల్ ప్రచార యాత్రలో వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం 15వ డివిజన్‌లో నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీలు వివరిస్తున్నామని, ప్రతి ఒక్కరి నుంచి స్పందన లభిస్తుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, నాయకులు పడతం లోకేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌లో మేడ్చల్ ఎక్సైజ్ సీఐ నవనీత తన బృందంతో కలిసి దాడులు చేసి అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. గిర్మాపూర్ గ్రామానికి చెందిన బండి మల్లేష్‌గౌడ్, ప్రమీల తమ ఇంటి వద్ద 122 బాటిళ్ల మద్యంను అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు చేస్తుండటంతో వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. మేడ్చల్ పరిధిలో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీలపై, క్లబ్‌హౌజ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు



ఓటు హక్కు వినియోగించుకున్న బాల్‌రెడ్డి



పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకుంటున్న సుజాత

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని మోహన్‌రావు కాలనీలో నివసించే దివ్యాంగురాలు సుజాత పోస్టర్ బ్యాలెట్ ద్వారా బుధవారం తన ఓటును వినియోగించుకున్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో వృద్ధాప్యం, అనారోగ్యంతో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అనిత, రేణుక, రెవెన్యూ, పోలీస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వినియోగించుకున్న వృద్ధుడు బాల్‌రెడ్డి

శామీర్‌పేట: ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో వృద్ధాప్యం, అనారోగ్యంతో ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బాబాగూడలో నివసించే వృద్ధుడు సింగిరెడ్డి బాల్‌రెడ్డి తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నాడు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

ఘట్‌కేసర్: ఆస్పత్రిలో విధుల పట్ల అశ్రద్ధ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బంది పనితీరు, ఓపీ రికార్డు, సిబ్బంది హాజరు రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రి వైద్యాధికారి కోట్యానాయక్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనురాగ్ యూనివర్సిటీలో రక్తదాన శిబిరం

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ యూనిట్-1 సహకారంతో 62వ జాతీయ ఫార్మసీ వీక్-2023 సందర్భంగా ఆరాధ్య బ్లడ్ బ్యాంక్, జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ క్యాంపస్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇంజినీరింగ్ డీన్ విజయ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానంతో అత్యవసర సమయంలో ఇతరుల ప్రాణాలు నిలబెడుతుందన్నారు. శిబిరంలో 180 మంది వలంటీర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ డీన్ వసుధ భక్షి, ఎన్‌ఎస్‌ఎస్ ఫార్మసీ కోఆర్డినేటర్ బాబాశంకర్, వలంటీర్లు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్సిటీ రక్తదాన శిబిరంలో వలంటీర్లు

ఎన్నికల ప్రక్రియ అంతా పారదర్శకం

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్(ఢిల్లీ)తో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఈవీఎం యంత్రాల కమిషనింగ్, ఇంటి నుంచి ఓటు సేకరణ, పోలింగ్ సిబ్బంది శిక్షణ, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై ఈ సందర్భంగా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ పలు సూచనలు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో శాసనసభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామన్నారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డులు(ఎపిక్)లను పోస్టల్ శాఖ ద్వారా నేరుగా ఓటర్లకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎం బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్, టెండర్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయ్యిందని, కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నారని తెలిపారు.

ఓట్ ఫ్రమ్ హోమ్‌కు ఏర్పాట్లు

జిల్లాలో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు మొత్తం 1070 మంది ఓట్ ఫ్రమ్ హోమ్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామన్నారు. ఇళ్ల వద్ద నుంచి వారి ఓటును స్వీకరించేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని గౌతమ్ తెలిపారు. ఈ బృందాలు ఓట్ ఫ్రమ్ హోమ్ ప్రక్రియ చేపట్టేలా ప్రణాళికలు రూపొందించామని, ఈసీ నిబంధనలకు అనుగుణంగా పూర్తి గోప్యతతో ఓటు సేకరణ జరిపేలా గట్టి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ తరగతులతో పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కల్పించామన్నారు. శిక్షణ కేంద్రాల వద్దే ఫెసిలిటేషన్ సెంటర్‌లను నెలకొల్పి పోలింగ్ విధుల్లో నియమించబడిన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులతో సహా ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది కోసం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు తదితర వాటి కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ.. గడువులోపు అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం రిసీవింగ్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను నెలకొల్పి పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు కృష్ణారెడ్డి, దేవసహాయం, విజయకుమారి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవ!

- మేడ్చల్ అయ్యప్ప ఆలయంలో నిత్యం అన్నదానం
- భక్తులకు కార్తీక పౌర్ణమి నుంచి సంకాంతి వరకు..
- 21 ఏళ్లుగా ప్రతీ ఏటా ఆలయంలో అన్నదానం



అయ్యప్ప ఆలయంలో భోజనాలు చేస్తున్న భక్తులు



మేడ్చల్ అయ్యప్ప దేవాలయం

మేడ్చల్: మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో మేడ్చల్ అయ్యప్ప ఆలయం అతిపెద్దది. నిత్యం వేలసంఖ్యలో అయ్యప్ప స్వాములతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. అయ్యప్ప స్వాముల దీక్షలు మొదలయ్యే సమయంలో మాత్రం ఆలయం భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఆ ప్రాంతమంతా అయ్యప్ప శరణు ఘోషలతో మార్మోగుతుంది. ఆలయ గురుస్వాములు రాజేశ్వర గురుస్వామి, నందారెడ్డి, జోగయ్య పంతులు దాదాపు 40 ఏళ్ల క్రితం మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీలలో అయ్యప్ప ఆలయం నిర్మించారు. మొదట చిన్నగా మందిరం నిర్మించి షెడ్లలో పూజలు నిర్వహించారు. దాతలు ముందుకు రావడం, విరాళాలు పెరగడంతో రాజేశ్వరగురుస్వామి, నందారెడ్డి, కృష్ణమూర్తి పంతులు ముగ్గురు కలిసి ఆలయ నిర్మాణానికి కృషి చేశారు. అనంతరం నిత్యం పూజలు, కార్యక్రమాలు, అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం దినదినాభివృద్ధి చెందింది. ఆలయం ఎదుట భారీ షెడ్డు, భోజనం చేసేందుకు వీలుగా హాల్, కిచెన్ నిర్మించారు.

నిత్యం 500 మందికి అన్నదానం చేస్తున్నాం..



మేడ్చల్ అయ్యప్ప ఆలయంలో 20 ఏళ్ల నుంచి అన్నదానం నిర్విరామంగా కొనసాగిస్తున్నాం. నిత్యం ఉభయ వేళల్లో 500 మందికి పైగా అన్నదానం చేస్తున్నాం. భక్తుల విరాళాలు, చేయూత వల్లే అన్నదానం చేయగలుగుతున్నాం.

– నందారెడ్డి, ఆలయ వ్యవస్థాపక గురుస్వామి.

20 ఏళ్ల నుంచి అన్నదానం..

భక్తుల నుంచి రోజుకు రూపాయి పిడికెడు బియ్యం అనే నినాదంతో వినూత్నంగా అన్నదానం కార్యక్రమాన్ని 20 ఏళ్ల క్రితం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మాల వేసుకునే భక్తులు వివిధ రూపాల్లో విరాళాలు ఇవ్వడంతో భోజన కార్యక్రమం ప్రారంభమైంది. మాలలు వేసుకునే భక్తులతో పాటు దాతలు విరాళాలు ఇవ్వడంతో అన్నదానం నిర్వహిస్తున్నారు.

వర్షాచల ఆలోచనలతో ప్రారంభమై..



నిత్యం అన్నదానం కార్యక్రమాన్ని భక్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నాం. వర్షాచల పథకం కింద రోజుకు రూపాయి, పిడకెడు బియ్యం సేకరించి, సరిపడా నిధులు సేకరిస్తున్నాం. విజయవంతంగా కొనసాగిస్తున్నాం.

– కృష్ణమూర్తి, ఆలయ అర్చక గురుస్వామి.

భక్తుల ఆకలి తీర్చడం కోసమే..

అయ్యప్ప దీక్ష అంటేనే కఠిన నియమాలు. దీక్షలు తీసుకునే భక్తులు ఎక్కడపడితే అక్కడ ఏదిపడితే అది తినలేని పరిస్థితి. మేడ్చల్ పారిశ్రామిక ప్రాంతం కావడంతో నిత్యం అయ్యప్ప భక్తులు మేడ్చల్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. దీక్షలు తీసుకునే వారికి భోజన విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే అన్నదానం నిర్వహిస్తున్నారు.



–రాజేశ్వరగురుస్వామి, ఆలయ గురుస్వామి

నవంబర్ 17 నుంచి జనవరి 20 వరకు..

నవంబర్ 17 నుంచి జనవరి 20 వరకు ప్రతి రోజు మేడ్చల్ అయ్యప్ప ఆలయంలో రెండు పూటలా అన్నాదానం సాగుతోంది. నిత్యం అయ్యప్ప ఆలయంలో మధ్యాహ్నం 500 నుంచి 800 మంది వరకు అయ్యప్ప స్వాములకు భోజనం పెడుతున్నారు.

స్వాములకు స్వాములే సేవకులై..

దాదాపు రెండు నెలల పాటు మేడ్చల్ అయ్యప్ప ఆలయంలో అన్నదానం సాగుతుంది. వంట చేసేందుకు సామాగ్రి దాతల రూపంలో సమకూరుతుంది. నిర్వహణ మాత్రం అయ్యప్ప దీక్షలు తీసుకున్న స్వాములు ముందుకు వచ్చి రెండు నెలల పాటు నిర్వహణ చేస్తున్నారు. వంట చేయడానికి ప్రత్యేకంగా ఒక మాస్టర్‌ను ఏర్పాటు చేసి మిగతా అన్ని కార్యక్రమాలు అక్కడే ఉన్న స్వాములు నిర్వహిస్తున్నారు.